క్లుప్తంగా

కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా హద్సరాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న హద్సరాణి

కోదాడ : పట్టణంలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా జి.హద్సరాణి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం జిల్లా గార్ల డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆమె పదోన్నతిపై కోదాడ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ప్రస్తుతం ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న చందా అప్పారావు నుంచి ఆమె కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్‌కు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్విజ్‌లో ‘తేజ’ విద్యార్థుల ప్రతిభ



అప్నాన్, ఇజ్రాయేల్

కోదాడ : హైదరాబాద్‌లోని బీఎం బిర్లా సైన్స్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన ఇండిక క్విజ్– 2024లో కోదాడలోని తేజ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 320 జట్లు పాల్గొనగా తేజ స్కూల్ విద్యార్థులు షేక్.అప్నాన్, ఎల్సా ఇజ్రాయేల్‌లు 87.5 పాయింట్లతో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రమాదేవి, డైరెక్టర్ సోమిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అవినాష్



గరిడేపల్లి : ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొండా అవినాష్ ఎన్నికయ్యారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సభ్యుల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ధరణి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా కో ఆర్డినేటర్ గుత్తా శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని చింతలపాలెంలో గల డాక్టర్ గారు అండ్ ఫ్రెండ్స్ కాటన్ మిల్లులో పత్తి దిగుమతికి స్థలం లేనందున సీసీఐ ఆధ్వర్యంలో జరిగే పత్తి కొనుగోళ్లు సోమవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తిని చింతలపాలెంలోని భారతమ్మ కాటన్ మిల్లులో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రంలో లేదా ఇతర ప్రాంతాల్లో గల సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. హుజూర్‌నగర్, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లోని అన్ని గ్రామాల పత్తి రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మోతె : మండలంలోని మామిళ్లగూడెం గ్రామానికి చెందిన కారింగుల సైదులు (39) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయనతో పాటు 2001లో పదవ తరగతి చదివిన బాల్య మిత్రులు రూ.30 వేల ఆర్థికసాయాన్ని సైదులు కుటుంబానికి అందజేసి చేయూతనందించారు. కార్యక్రమంలో సుంకర రవి, ఎస్‌కే నాగుల్‌మీరా, బప్పరోజు జనార్దన్, కేసాని వెంకన్న, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

ఎంఈఓకు సన్మానం



సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మేళ్లచెరువు : ఇటీవల బదిలీపై వెళ్లిన మండల విద్యాధికారి సైదానాయక్‌ను శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మండల విద్యాధికారి వెంకటరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మాణానికి మునగాల మండలం నారాయణగూడెంకు చెందిన ఊటుకూరు నాగేశ్వరరావు, ఝాన్సీలక్ష్మి దంపతులు శనివారం నడిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.51,116లు విరాళాన్ని అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భవిరిశెట్టి వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి కొండా వెంకన్న, సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మూల మలుపుల్లో రోడ్లను కంపచెట్లు కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో మూలమలుపుల వద్ద ఈ రెండు నెలల వ్యవధిలో 10 కు పైగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా చిలుకూరు నుంచి దూదియాతండాకు వెళ్లే రోడ్డు, సీతారాంపురం నుంచి నారాయణపురం రోడ్డు, చిలుకూరు నుంచి ఆర్లెగూడెం రోడ్డు, దూదియాతండా నుంచి జానకీనగర్ రోడ్డు ఇరుపక్కల కంపచెట్లు పెగిరి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు ఇరుపక్కల కంపచెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సీతారాంపురం- నారాయణపురం రోడ్డు మూలమలుపులో కంపచెట్లు



చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డులో ఇలా..

మద్యం అధిక ధరలను అరికట్టాలని ధర్నా



ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

హుజూర్‌నగర్ : మద్యం అధిక ధరలను అరికట్టాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైన్ షాపులు, బెల్ట్ షాపులు సిండికేట్ అయి క్వార్టర్‌పై ఉన్న ధర కన్నా అదనంగా రూ.20 నుంచి రూ.30 వసూలు చేస్తున్నారని, అయినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల వద్ద గల బెల్టు షాపులను మూసి వేయాలని, కల్తీ మందు అమ్మకాలను అరికట్టాలని ఆయన కోరారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు కోరారు. శనివారం పట్టణంలోని టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు శ్రీనివాస్, దయాకర్, బెంజిమెన్, అరుణ్ కుమార్, ఇర్మియ, కళ్యాణ్, దశరథ, రాములు, కోటమ్మ, సావిత్రి, వినోద్, రాము, అశోక్, అంబేద్కర్, అరుణ్ కుమార్, పున్నయ్య పాల్గొన్నారు.

1న మాలల సింహగర్జన

గరిడేపల్లి : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న జరగబోయే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి హుజూర్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు అన్నారు. శనివారం మండలంలోని కుతుబ్షాపురం గ్రామంలో మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం సంఘం గ్రామ మహిళా శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జక్కి మరియమ్మ, ఉపాధ్యక్షురాలిగా మేక పద్మ, ప్రధాన కార్యదర్శిగా గండమళ్ల పావని, సహాయ కార్యదర్శులుగా కట్టా మాలశ్రీ, బోయిల్ల యల్లమ్మ, కోశాధికారిగా బోయిళ్ల వినోద, ఉప కోశాధికారిగా కట్టా కృష్ణవేణిను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మరియమ్మ, నిర్మల, పవిత్ర, అనూష, వెంకటమ్మ, వీరమ్మ, నాగలక్ష్మి, పుష్ప, చంద్రమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు పుట్లూరి సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, వల్లూరి శ్రీనివాస్‌రావు, జూకూరి శ్రీనివాస్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఎస్.విజయకుమార్, శ్రీనివాస్, సూర్జహాసన్, సైదాబి, నెల్సన్, ఇందిరా, కృష్ణ తదితరులు ఉన్నారు.

పని ఒత్తిడి నుంచి ఉపశమనానికి పరేడ్



పోలీస్ పరేడ్‌లో సీఐ చరమందరాజు, సిబ్బంది

హుజూర్‌నగర్ : పోలీసులు పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు పరేడ్ దోహద పడుతుందని సీఐ చరమందరాజు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నియోజకవర్గంలోని ఎస్ఐలు, స్టేషన్ సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం పరేడ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక దురాచారాలను పారదోలాలి



గ్రామ సభలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మునగాల : సాంఘిక దురాచారాలను పారదోలాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ అన్నారు. శనివారం మునగాల మండలంలోని విజయరాఘవపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రెండు గ్లాసుల పద్ధతిపై అవగాహన కల్పించారు. కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాల నివారణను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దార శ్రీనివాస్, ఏఎస్ఐ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ స్వప్న, పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ సుధాకర్, ఆశా వర్కర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, పంచాయతీ సిబ్బంది రాజేష్, బాణా రుషీ, యువత, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నదానం

కోదాడ రూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డు బైపాస్ పక్కన గల గాలి రమేష్‌నాయుడు బ్రదర్స్ స్థలంలో 20వ రోజు శనివారం 400 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి కోదాడ పట్టణానికి చెందిన సంపెట సుధాకర్ గౌడ్ (ఏజీపీ), అనంతుల నరేష్ గౌడ్ –స్వప్న దంపతులు కుమార్తె సమన్వి పుట్టినరోజును పురస్కరించుకొని సహకరించినట్లు నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు తెలిపారు.

మునగాల : మండల కేంద్రం శివారులోని అయ్యప్ప ఆలయం ఆవరణలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన నలబోలు అజయ్‌కుమార్‌రెడ్డి, వల్లోజు ఉపేందర్ –సంధ్య దంపతులు, కోదాటి శ్రీను –కవిత దంపతులు సహకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

నడిగూడెం : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తెల్లబల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జి.పద్మావతి కోరారు. శనివారం నడిగూడెం మండలంలోని ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండాలోని ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆమె వెంట సీఆర్‌పీ నందిగామ రామారావు, ఉపాధ్యాయులు భాస్కర్, కోటయ్య ఉన్నారు.

పాఠశాల పరిశీలన



ఉపాధ్యాయురాలి బోధన తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి : ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. శనివారం మండలంలోని గారకుంటతండాలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా డిసెంబర్ 4న జరిగే నాస్ పరీక్షకు 3వ తరగతి విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న రుచికరమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు, పి.వీరస్వామి, కవిత, వెంకటేశ్వర్లు, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాంపురంతండాలో వైద్య శిబిరం

మోతె : మండలంలోని రాంపురంతండాలో శనివారం బడావో బంజార పాజీర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారుగా 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిభిరంలో ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ ప్రేమ్‌సాగర్ సింగ్, ట్రసు మేనేజర్ సాలోమన్ భూక్యా, డాక్టర్ల బృందం కళ్యాణ్‌సాగర్, విజయ్, క్రిస్టినా సాలోమాన్, ధనరాజ్, ట్రస్టు ప్రతినిధులు వస్రం నాయక్, బ్యూల, బాలరాజు, మహేందర్, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



మునగాల కేజీబీవీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

మునగాల : విద్యాశాఖలోని సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్)అమలు చేయాలని సర్వశిక్ష అభియాన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాంపంగు వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల ఎదురుగా భోజన విరామ సయయంలో కాంట్రాక్టు సిబ్బందితో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ విషయమై 15 రోజుల్లో స్పందించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారికి సమ్మె నోటీస్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటాచారి, ప్రిన్సిపాల్ వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టాపర్స్‌కు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, హెచ్ఎం

చిలుకూరు : మండల స్థాయిలో నిర్వహించిన గణితం టాలెంట్ టెస్ట్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం విభాగాల్లో చిలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నితిన్, నరేందర్ మండల టాపర్స్‌గా నిలిచారు. శనివారం వారిని ఎంఈఓ గురవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో గణితం ఉపాధ్యాయులు రవికుమార్, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

హుజూర్‌నగర్ : వివిధ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెప్మా, మధ్యాహ్న భోజన పథకం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలుగా పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి నెలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకన్న, మంగమ్మ, కోటమ్మ, చంద్రకళ, పద్మ, తులసి, వరలక్ష్మి, శాంత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



అలివేలు మంగను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తదితరులు

నడిగూడెం : విద్యారంగానికి అలివేలు మంగ చేసిన సేవలు అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని కాగిత రామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న అలివేలు మంగ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పని చేస్తే ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం అలివేలు మంగను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన న్యాయవాదులు



హనుమకొండకు తరలివెళ్తున్న న్యాయవాదులు

కోదాడ : హనుమకొండలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర మహాసభలకు కోదాడ నుంచి పలువురు న్యాయవాదులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో సీనియర్ న్యాయవాది చింతకుంట్ల లక్ష్మీనారాయణ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. న్యాయవాద వృత్తిలో ఎదురవుతున్న సవాళ్లు, న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన అంశాలపై ఈ మహసభల్లో చర్చించి తగు కార్యాచరణ రూపొందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల రామిరెడ్డి, ఎస్‌కె.రహీం, కోడూరు వెంకటేశ్వరరావు, తాటి మురళి, ఆవుల మల్లికార్జునరావు, దొడ్డా శ్రీధర్, గోవర్ధన్, హనుమంతరావు, లక్ష్మీకాంత్, సిలివేరు వెంకటేశ్వర్లు, నర్సయ్య, నవీన్, నాగుల్‌మీరా, పాష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం



కోదాడ : పాఠశాలల బంద్ చేపడుతున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు

కోదాడ : రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా నేటికీ విద్యాశాఖమంత్రి లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వేణు, ఉదయ్, చరణ్, ఉమేష్, సుమన్, గౌతమ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. ప్రభుత్వం విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వేణు, రాఖి, ఉదయ్, చరణ్, ఉమేష్, గోపి, గౌతమ్, అఖిల్, తేజ, శ్రీను, మధు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతికి ప్రభుత్వానిదే బాధ్యత

నేరేడుచర్ల : ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల మృతికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని, వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫుడ్ పాయిజన్ జరగడాన్ని నిరసిస్తూ శనివారం విద్యా సంస్థల బంద్ చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు వెంకట్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కోమట్రాజు వెంకట్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రెడ్డిపల్లి వినయ్, నాయకులు భార్గవ్, జ్యోతిబాయి, రాంప్రసాద్, సైదా, చెన్నకేశవులు, నిఖిల్, జయంత్, రాహుల్, సాయికృష్ణ, భరత్, వివేక్, శివ, నాగరాజు ఉన్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కమల

గరిడేపల్లి : రైతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అసిస్టెంట్ రిజిస్ట్రార్, పీఏసీ జె.కమల అన్నారు. శనివారం మండలంలోని సర్వారం సహకార సంఘం కార్యాలయంలో రైతు పండుగ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం సన్న వడ్లకు రూ. 500లు బోనస్ ఇస్తుందన్నారు. , రైతులకు రైతు భరోసా, రైతు బీమా అందిస్తుందన్నారు. ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తుందని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాతా



బేతవోలులో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు, కొండాపురం గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.500 గ్యాస్, ఉచిత బస్సు, ఉచిత కరెంట్, రుణమాఫీతో పాటు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ఆటపాటల ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాము, కళాజాతా టీమ్ సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, నాగరాజు, శ్రీకాంత్, శంకర్, ఉపేందర్, వేణు, శిరీష, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కళాజాతా సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. స్వామివారి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

తిరుమలగిరి : తిరుమలగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 30 కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సోమేష్, కార్యదర్శి గణేష్, కోశాధికారి రమేష్, రేవూరి రమణారెడ్డి, మండడి పద్మారెడ్డి, రామచంద్రం గౌడ్, కృష్ణమాచారి, శ్రీనివాస్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.